క్లుప్తంగా

శ్రీవారికి సహస్ర నామార్చన



శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరునికి విశేష పుష్పాలతో అలంకరణ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో వేంకటేశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచే శ్రీవారికి సుప్రభాత సేవ, తోమాల సేవను నిర్వహించారు. శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరునికి విశేష పుష్పాలతో సహస్ర నామార్చనలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

షిర్డీసాయి శాంతిధామంలో వార్షిక వేడుకలు ప్రారంభం



సామూహిక ధుని పూజలో ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: స్థానిక సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామంలో ఏకాదశి వార్షిక వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయినాథుడికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక ధుని పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్ ఏర్పాట్లు చేశారు.


రజక సేవా సంఘానికి కుర్చీల వితరణ



కుర్చీలను అందజేస్తున్న గోపిశెట్టి ఆదినారాయణ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం గ్రామ రజక సేవా సంఘానికి అవసరార్థం దాతలు కుర్చీలను అందజేశారు. ఆదివారం 69వ వార్డు నాతయ్యపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గోపిశెట్టి ఆదినారాయణ ఆర్థిక సహాయంతో ఆయన కుమార్తె సంద్రాన నిహారిక, అల్లుడు సంద్రాన గణేష్ చేతులు మీదుగా రూ.14,700 విలువ గల 32 కుర్చీలను రజకులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రవీంద్ర భారతిలో చిన్నారుల సందడి



ఉపాధ్యాయులతో విద్యార్థులు

గాజువాక : స్థానిక రవీంద్ర భారతి స్కూల్‌లో విద్యార్థులు సందడి చేశారు. పాఠశాలలో నిర్వహించిన వీడ్కోలు వేడుక సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. తమ సీనియర్లకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఆర్.కవిత మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో ఉపాధ్యాయులకు విడదీయలేని అనుబంధం ఏర్పడుతుందని, వారు పాఠశాలను వదిలి వెళ్తున్న సమయంలో ఎంతో భావోద్వేగానికి గురవుతామన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల సీఈఎం జి.ఆర్.వసంత తదితరులు పాల్గొన్నారు.

డిజైర్ సొసైటీ చిన్నారులకు పౌష్టికాహారం కిట్ల వితరణ

గాజువాక : స్థానిక డిజైర్ సొసైటీలో ఆశ్రయం పొందుతున్న హెచ్ఐవీ బాధిత చిన్నారులకు బొత్స ఉమా చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ బొత్స దిలీప్ కుమార్ సమకూర్చిన ఈ కిట్లను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డిజైర్ సొసైటీ నిర్వాహకులకు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు బొత్స జగదీష్, దామోదర్‌రావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్ కలేనా?

అగనంపూడిలో రైతు బజార్ ఏర్పాటు ప్రతిపాదనలు బుట్టదాఖలు	కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నిర్లక్ష్యం	అధికారులు, నాయకులు స్పందించాలని ప్రజల విజ్ఞప్తి

అగనంపూడి: అగనంపూడిలో రైతు బజార్ ప్రతిపాదనలు అటకెక్కాయి. ఏడాదిన్నర క్రితం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు పంపించిన ప్రతిపాదనలకు దిక్కులేకుండా పోయాయి. దీంతో రైతు బజార్ ఏర్పాటు కలగా మిగిలిపోయింది. దీంతో రైతులు, వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


33 ఉక్కు, ఫార్మా నిర్వాసిత కాలనీలు.. వందలాది బహుళ అంతస్తులు... పదుల సంఖ్యలో కాలనీలు.. రెండు వార్డుల్లో విస్తరించిన అగనంపూడిలో సుమారు లక్షకు పైగా జనాభా నివాసముంటున్నారు. వీరంతా కూరగాయల కోసం అగనంపూడి వారపు సంతపై ఆధారపడున్నారు. వారానికి సరిపడా కూరగాయలు సంతరోజే కొనుక్కుంటున్నారు. అగనంపూడి పరిసర గ్రామాల్లో కూరగాయలు పండించే రైతులు ఎక్కువగా ఉండడంతో రైతు బజార్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ) నాలుగేళ్ల క్రితం తెరపైకి తీసుకువచ్చారు. పూర్ణ ప్రత్యేక చొరవ, అప్పటి ఎమ్మెల్యే నాగిరెడ్డి కృషితో జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు విన్నవించారు. స్పందించిన రెవెన్యూ అధికారులు ఏడాదిన్నర క్రితం అగనంపూడి రెవెన్యూ సర్వే నంబర్ 56లో 60సెంట్ల స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తరువాత సదరు స్థలాన్ని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకొని రైతు బజార్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టారు. స్థానికంగా ఉన్న రైతులు, పండే పంటల వివరాలను పొందుపర్చుతూ ప్రతిపాదనలను రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు సమర్పించారు. ఎన్నికల కారణంగా అప్పట్లో రైతు బజార్ ఏర్పాటు నిలిచిపోయింది. తరువాత వచ్చిన ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు చేపట్టకపోవడం, పాలకులు దృష్టి సారించకపోవడంతో ప్రతిపాదనల దశలోనే నిలిచిపోవడంతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు.



బుధవారం నిర్వహించే వారపు సంత



రైతు బజార్ కోసం కేటాయించిన స్థలం



అగనంపూడి కాలనీ ముఖ చిత్రం



సంత ఆవరణలో స్థలాభావంతో జాతీయ రహదారిపైనే అమ్మకాలు

అనుమతి రావడమే ఆలస్యం...



రైతు బజార్ కోసం కేటాయించిన స్థలాన్ని అప్పట్లోనే స్వాధీనం చేసుకున్నాం. సమీప గ్రామాల్లో కూరగాయలు పండించే రైతులను హార్టికల్చర్ విభాగం సేకరించింది. వివరాలతో కూడిన నివేదికను కమిషనర్‌కు ఏడాదిన్నర క్రితం పంపించాం. అనుమతి వచ్చాక పనులు చేపడతాం.

–షేక్ యాసిన్, అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా మార్కెటింగ్ శాఖ

ఎమ్మెల్యే కలుగజేసుకోవాలి



అప్పటి ఎమ్మెల్యే నాగిరెడ్డి కృషితో రైతు బజార్‌కు స్థలం కేటాయింపులు చేయించడంతోపాటు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపించగలిగాం. అధికారులను ఒప్పించి, ప్రతిపాదనలు పంపించాం. ఈలోగా ఎన్నికలు రావడంతో ప్రతిపాదనలకు మోక్షం కలగలేదు. స్థానిక ఎమ్మెల్యే కలుగజేసుకొని అగనంపూడిలో రైతు బజార్ ఏర్పాటు ఫైల్ కదిలే చూడాలి. స్థానికులకు నాణ్యమైన కూరగాయలు, రైతులకు గిట్టుబాటు ధర కోసం రైతు బజార్ ఆవశ్యకతను గుర్తించాలి.

–జి.పూర్ణానందశర్మ (పూర్ణ) వైఎస్సార్‌సీపీ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు

ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్నాం



అగనంపూడిలో రైతు బజార్ ఏర్పాటు చేస్తే అగనంపూడి, దువ్వాడ, లంకెలపాలెం, ఫార్మాసిటీ నిర్వాసితులకు తాజా కూరగాయలు తక్కువ ధరకు అందుతాయి. గతంలో టోల్‌గేటు దగ్గర స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం కేటాయించిన స్థలం కూడా బీసీ కాలనీకి ఎదురుగా జాతీయ రహదారిని ఆనుకొని కేటాయించడం సంతోషం. స్థానిక నాయకులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని రైతు బజార్ ఏర్పాటు చేయించాలి.

–కొమ్మోజు భీష్మాచారి, పెదమడక

రైతు బజార్ ఏర్పాటు అవసరం



రైతు బజార్ ఏర్పాటు చేస్తే వారపు సంతపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ప్రతి రోజు తాజా, నాణ్యమైన కూరగాయలు స్థానికంగా లభిస్తాయి. రైతు బజార్ ఏర్పాటు చేస్తే సుమారు లక్షకు పైగా జనాభాకు అనుకూలంగా ఉంటుంది. ప్రభుత్వంపై దృష్టి సారించాలి.

–కొశిరెడ్డి రమణారావు, అగనంపూడి సెక్టార్–1

ఘనంగా సుదర్శన హోమం



ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సుదర్శన హోమం ఘనంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు భావ నారాయణ స్వామి, హరి నారాయణ స్వామి నేతత్వంలో వేకువజామున స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా సింహాచలానికి చెందిన రుత్వికుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా పండిత సదస్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన రుత్వికులు పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం ఆలయంలో లక్ష తులసి పూజ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వార్డు పరిధిలోని దయాల్‌నగర్ క్వారీ రోడ్డులో కొలువుదీరిన స్వర్ణ నూకాంబిక ఆలయంలో ఆలయ మహిళా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



ఆలయంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ సలీం పురుషోత్తమన్



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–3 కాంప్లెక్స్‌లోని వరసిద్ధి వినాయకుని వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. వరసిద్ధి వినాయక ఆలయం 19వ వార్షికోత్సవాల్లో భాగంగా వారం రోజులుగా వివిధ పూజలు, హోమాలు, వరసిద్ధి వినాయకుని కల్యాణ మహోత్సవం జరిగింది. ముగింపు ఉత్సవాల్లో భాగంగా వేకువజామున పంచామృతాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన సమారాధనలో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన సుమారు 5 వేల మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం పూజలో భాగంగా వివిధ పండ్ల రసాలతో అభిషేకం చేశారు. స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ (ఆపరేషన్స్) సలీం పురుషోత్తమన్, టౌన్ అడ్మిన్ విభాగాధిపతి వై.చంద్రశేఖర్‌లు దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ హనుమంతరావు

అగనంపూడి: అగనంపూడి లయన్స్‌క్లబ్, ముత్యాలహారం ఫౌండేషన్ సంయుక్తంగా అగనంపూడిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ కిడిమి హనుమంతరావు, ఉపాధ్యక్షుడు బత్తుల కాళిదాస్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్, ముత్యాలహారం ఫౌండేషన్ సంయుక్త సారథ్యంలో ప్రతీనెలా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సహకారం అందిస్తున్న కమిటీ ప్రతినిధులను అభినందించారు. ఈ సందర్భంగా 40 యూనిట్ల రక్తాన్ని రోటరీ క్లబ్‌కు అందించారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పట్టా రామ అప్పారావు, బలిరెడ్డి నాగేశ్వరరావు, బత్తుల భగీరావు, బోసుబాబు, భాస్కర్, రాజు, రఫీ, మడుగల నరసింగరావు, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి శ్రీకృష్ణదేవరాయ సంఘం సేవలు

గాజువాక : గాజువాకలో శ్రీకృష్ణదేవరాయ సంక్షేమ సేవా సంఘం అందిస్తున్న సేవలను ఆ సంఘం అడహక్ కమిటీ నాయకులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వివరించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిసి తమ సంఘం ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఇకపై తాము చేపట్టబోయే సేవలకు, కార్యక్రమాలకు సహకరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో అడహక్ కమిటీ చైర్మన్ గుడివాడ అమ్మన్న, కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, విందుల రమణ, నాగేశ్వరరావు, గూటూరు శంకరరావు, గంధం వెంకటరావు, నీరుకొండ రామచంద్రరావు తదితరులున్నారు.

అద్భుతంగా యామిని కూచిపూడి రంగప్రవేశం



కూచిపూడి నృత్యంతో అలరిస్తున్న యామిని

మద్దిలపాలెం: నృత్యకారిణి యామిని కూచిపూడి నృత్యంలో రంగప్రవేశం చేశారు. సిద్ధేంద్ర యోగి కళా నిలయం గురు ఎస్.ఎస్.వి.సత్యభాను వద్ద 15 ఏళ్లుగా రాష్ట్ర సంప్రదాయ నాట్యం కూచిపూడిని అభ్యసిస్తూ, సర్టిఫికెట్ కోర్స్ డిప్లమో కోర్స్ ఇన్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో పాసై అనేక ప్రతిష్టాత్మకమైన ప్రదర్శనలు ఇచ్చిన ఆమె ఆదివారం మద్దిలపాలెం కళా భారతి ఆడిటోరియంలో కూచిపూడి నృత్యంతో అలరించారు. ముఖ్య అతిథి చార్టెడ్ అకౌంటెంట్ చంద్రశేఖర్, కళాభారతి కార్యదర్శి డాక్టర్ జి.ఆర్.కె.ప్రసాద్ రాంబాబు, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతా రవి బాలకృష్ణ, కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ గురు హరిరామ్మూర్తిల సమక్షంలో అద్భుతమైన కూచిపూడి నాట్యముద్రికల నడుమ ఆమె కూచిపూడి రంగప్రవేశం చేశారు. ఈ సందర్భంగా యామిని చేసిన నాట్యం అతిథులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం ఆమెను ఆశీర్వదించి నాట్య సౌదామిని అవార్డుతో సత్కరించారు. యామిని సిద్ధేంద్ర యోగి కళా నిలయం ఫౌండర్ డైరెక్టర్ ఎస్.ఎస్.వి.సత్యభాను గురుపూజోత్సవం చేశారు. ఈ రంగ ప్రవేశ కార్యక్రమానికి గాత్రం డి.ఎస్.వి.శాస్త్రి, మృదంగం రాజాగోపాల ఆచార్య, వయొలిన్ ఎమ్మెస్ నీలాద్రి, వీణ శశిధర్, ఫ్లూట్ వి.బి.ఎస్.మురళి, మేకప్ ధరణి, దుస్తులు కూర్మారావులు సహకరించారు.

కృష్ణా కళాశాలలో నేడు జాబ్‌మేళా

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్‌లో ఉద్యోగ నియామకాల కోసం జరగనున్న ఈ జాబ్ డ్రైవ్ కేవలం పురుషులకు మాత్రమేనని చెప్పారు. ముఖ్యంగా బీఎస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, బీటెక్ కెమికల్, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎంఎస్సీ ఎనలిటికల్ కెమిస్ట్రీ, ఎం.ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు ఒక సువర్ణ అవకాశమన్నారు. ఎంపికైన వారికి ఉచిత వసతి, ఉచిత యూనిఫాం, పీఎఫ్, ఈఎస్ఐ, రాయితీతో కూడిన భోజన సదుపాయం, జీతంతో పాటుగా కల్పించనున్నారని తెలిపారు. కనీస జీతం రూ.18,000, గరిష్ట జీతం రూ. 24 వేలుగా ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులందరూ ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగాలను పొందాలన్నారు.

గ్రంథాలయ భవనం ప్రారంభం



సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో రూ.32 లక్షలతో నిర్మించిన కొత్త భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ముందుగా సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పులి లక్ష్మీబాయి, గంధం శ్రీనివాసరావు, దల్లి గోవింద్, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, ప్రసాదుల శ్రీనివాసరావు, లైబ్రేరియన్ పీవీ రమణ, రిటైర్డ్ లైబ్రేరియన్ అమ్మాజీ, సాహిత్య సుధ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాఘవాచార్యులు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోకో పైలట్లకు మరుగుదొడ్ల వసతి కల్పించాలి

అగనంపూడి: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రైలు భోగీలు రూపొందిస్తున్న రైల్వే అధికారులు లోకో పైలట్లకు మాత్రం మరుగుదొడ్ల వసతి కల్పించకపోవడం తగదని రైల్వే తూర్పు కోస్తా కన్సెల్టెన్సీ కమిటీ సభ్యులు కె.ఈశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. లోకో పైలట్లుగా మహిళలు కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారని, అలాంటి సమయంలో కనీసం రైలింజన్లలో మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో గంటల తరబడి ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. మరుగుదొడ్ల ఏర్పాటును పరిశీలించాలని రైల్వే ఉన్నతాధికారులను ఆయన కోరారు.

ప్రమాద సంఘటనపై ఫిర్యాదు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రధాన రహదారిలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. ఈనెల 5వ తేదీన కూర్మన్నపాలెంకు చెందిన ఎం. సూర్యనారాయణ ఉదయం బైక్‌పై ఉక్కునగరంలోని అయ్యప్ప ఆలయానికి వెళ్తున్నారు. శ్రీచైతన్య జూనియర్ కళాశాల దాటిన కొద్ది దూరంలో వెనుక నుంచి వేగంగా వచ్చి ఒక బైక్ సూర్యనారాయణ బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో సూర్యనారాయణ తలపై, మెడ, చేతులు, కళ్లపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆదివారం దీనికి సంబంధించి సూర్యనారాయణ కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ భద్రతా వారోత్సవాలపై అవగాహన



జాతీయ భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న హెచ్ఎస్ఎల్ ఉద్యోగులు

సింధియా: అనకాపల్లిలో జరిగిన 54వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు. రాష్ట్ర కార్మిక, కర్మాగారాల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి ప్రసాద్, ఫ్యాక్టరీస్ డైరెక్టర్ వాణిప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పూడికలు తొలగింపు



కుంచుమాంబ ఆలయం వెనుక శుభ్రం చేసిన గెడ్డ



గంగవరం పోర్టు సమీపంలో శుభ్రం చేసిన గెడ్డ

సాక్షి ఎఫెక్ట్..

పెదగంట్యాడ: గెడ్డల్లో పూడుకుపోయిన చెత్తాచెదారాన్ని అధికారులు తొలగించారు. అందులోని పూడికలను జేసీబీల సాయంతో తీయించారు.

జీవీఎంసీ 75, 76వ వార్డు పరిధిలో ప్రధాన గెడ్డలు చెత్తాచెదారం, పూడికలతో నిండిపోయి దర్శనమిచ్చేవి. మురుగునీరు సాఫీగా పారకుండా అక్కడే నిలిచిపోయేది. దీంతో దుర్వాసన వెదజల్లేది. అలాగే దోమలు కూడా విజృంభించేవి. ఒక పక్క దుర్వాసన, మరోపక్క దోమల బెడద కారణంగా స్థానికులకు కంటిమీద కునుకులేకుండా ఉండేది కాదు. ఈ నేపథ్యంలో ఈ నెల 7న సాక్షిలో 'డర్టీ పిక్చర్' శీర్షికను కథనం ప్రచురితమైంది. దీంతో జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు స్పందించారు. జేసీబీల సాయంతో గెడ్డల్లో చెత్తాచెదారంతో పాటు పూడికలను తొలగించారు.

బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చడానికి వీల్లేదు



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి వేంకటేశ్వర్లు

ఉక్కునగరం: బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి వీల్లేదని విశాఖ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ హెచ్చరించింది. ఆదివారం ఉక్కునగరం బంజారా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఎల్. నాయక్, ప్రధాన కార్యదర్శి భూక్య వేంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్టీల్లో ఉన్న తెగలకు ఇప్పటికే ఉద్యోగావకాశాలు తగ్గిపోయాయన్నారు. తద్వారా ఎస్టీల్లో నిరుద్యోగ సమస్య పెరిగిపోతోందన్నారు. తద్వారా ఎస్టీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బోయ, వాల్మీకులను ఎస్టీలో కలుపుతూ తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదన విరమించుకోక పోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, రాథోడ్ వస్రం, బీకే నాయక్, బీఎంకే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారులకు అభినందనలు



స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

సింధియా: ఈ నెల 5,6,7 తేదీల్లో కృష్ణా జిల్లా గన్నవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో జై భీమ్ బాక్సింగ్ క్లబ్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు బంగారుపతకాలు సాధించారు. ఆదివారం నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో క్రీడాకారులను పలువురు అభినందించారు. జీవీఎంసీ 40వ వార్డుకు చెందిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది పతకాలు సాధిస్తున్నారని, వారంతా తన శిష్యులు కావడం గర్వకారణంగా ఉందని జై భీమ్ బాక్సింగ్ క్లబ్ కోచ్ గుర్రాల రామారావు ఆనందం వ్యక్తం చేశాడు. అండర్ వెయిట్ 44,46 కేజీల జూనియర్ మహిళా విభాగంలో ధనశ్రీ, 65, 70 కేజీల విభాగంలో రేష్మ, ప్రవల్లిక బంగారు పతకాలు సాధించినట్లు కోచ్ రామారావు తెలిపారు.